**జల్లు కురిసిన జాడ కమ్మని మట్టివాసన రోహిణీకార్తె పాకలో చల్లగా ఉండడం వల్ల నడుం వాల్చిన చంద్రయ్య పరుగు పరుగున పొలం గట్టుకు వెళ్ళి తనివితీరా మట్టివాసన గుబాళింపులు చవిచూశాడు. రోహిణీకార్తెలో వర్షం కురిస్తే ఓ నెల ముందుగా పంటలు ఇల్లు చేరతాయని పెద్దలు చెప్పిన మాట జ్ఞాపకానికి వచ్చింది.**

ఆకాశాన్ని తనివితీరా చూశాడు. బాధలు భరించలేని సూరీడు మబ్బుల చాటుకు వెళ్ళి విశ్రాంతి తీసుకుంటున్నాడు. పిల్లనగ్రోవి నాదంలా పిల్లగాలి... వర్షపు జల్లుకి చంద్రయ్య తడిసి ముద్దయిపోయాడు. మట్టి రెండు చేతులతో పిసికి మరీ వాసన చూశాడు.

బంగారు... మట్టి బంగారు తల్లి! తరతరాలుగా పల్లె పంటలతో రైతుకు జీవనాధారమైంది. ఎవరు ఎన్ని విధాలుగా చెప్పినా పంటలు వేస్తూ కష్టపడుతూ నష్టపోతూ రాబోయే యేడు మీద బోలెడు ఆశతో ఎదురుచూడడం పది సంవత్సరాలుగా అలవాటయిన పని. నిరాశ ఎల్లకాలం ఉండదని గట్టి నమ్మకం. మట్టిని నమ్మేది రైతు ఒక్కడే. మట్టిలో మంచి చెడుల పంచాంగం చూసుకుని ఉగాదికి ఊరట చెంది, కొత్త ఆశలతో పచ్చడి తిని కలలు కనేది రైతు బిడ్డలే... చిన్నతనంలో వేరుసెనగ కాయలు తినడం దానితోపాటు రేగడి మట్టి తినడం ఆనాడే అలవాటయిన రుచి.

ఆకాశం కొంత నిర్మలమై పడమటి దిశలోకి జారిపోతూ సూర్యుడు దశ మార్చుకుంటున్నాడు. చంద్రయ్య ఇల్లుచేరి నులక మంచంలో నడుం వాల్చి గతంలోకి జారిపోయాడు.

పది సంవత్సరాల క్రితం చంద్రయ్యకు, ఇప్పటి చంద్రయ్యకు ఎంతో తేడా ఉంది. నాడు పాతిక ఎకరాల ఆసామి ఈ రోజు పది ఎకరాలకు యజమాని. కాలం శరీరానికి వయసు తీసుకువచ్చింది. పిల్లలు ఎదగడం, ఇద్దరాడపిల్లల పెళ్ళిళ్ళకు ఐదెకరాలు కృంగిపోయింది. పంటలు సరిగా పండక ప్రతి యేడు కొత్త ఆశలతో తెల్లవారి నిరాశతో చీకటి పడుతుండగా అప్పులు కుప్పలై తిప్పలు పడలేక ఎదిగిన కొడుకు చేదోడు వాదోడుగా ఉన్నా కరుణించని ప్రకృతి రాకాసి కోరల్లోకి పది ఎకరాల భూమి కరిగిపోయింది. ఉన్న ఒక్క కొడుకును చదివిద్దామని ఎంత ప్రయత్నం చేసినా తల్లి సూరమ్మ మనవడిని రైతుగానే మార్చాలని చంద్రయ్యతో పోరుపెట్టింది. 'లోకానికి దిక్కు రైతురా... వ్యవసాయానికి మించింది ఏముంది? చదువు కూడు పెట్టదు. రైతుకు ప్రపంచం మోకరిల్లుతుంది. నా మనవడు వాడి తాతలా పెద్ద ఆసామి కావాలి' నాయమ్మ అండ చూసుకుని సాయన్న చదవకుండా పొలం పనులకే అంకితమయ్యాడు. పెళ్ళి చేశాడు ఇప్పుడు వాడికి ఒక కొడుకు కూడాను. కరిగిపోయిన పదిహేను ఎకరాలు జ్ఞాపకం వచ్చినపుడు చంద్రయ్యకు కళ్ళలో నీళ్ళు తిరుగుతాయి.

కాలం కొలిమిలో కాలిపోయేది పేదోడు తప్ప పెద్దోడు కాదు. పెద్దోడికి నాలుగు రకాల రాబడి ఉంటుంది. ఒకదానిలో నష్టం వచ్చినా మరో దానిలో లాభం పొందుతాడు. పేద రైతు మాత్రం నేలరాల్చిన విత్తనం ఫలవంతమైతేనే రాలిన చెమటచుక్కల సాక్షిగా మూడు పూటలా తినేది.

ఇప్పుడు కాలం ఎంతో మారిపోయింది. కొత్తగా అరక పెట్టాలి అంటే వేలకు వేలు పెట్టుబడి పెట్టాలి. యూరియా, డి.ఎ.పి. పురుగు మందులకు కూలినాలికి ఖర్చు పెట్టాలి. రాబడి మాత్రం గాలికి వదిలివేయాలి. ఒక యేడు ఆకాశం కనికరించదు. ఒక యేడు సముద్రం ధిక్కరించి తుపాను రేగుతుంది. మరో యేడు నేల కరుణించదు. నేల సహకరించినా రైతు ఆశలను పురుగులు చిరుగులోనే నలిపేస్తాయి. ఇవన్నీ అధిగమించిన పండిన కొద్దిపాటికి ధరలు పలికే దాతలు కరువు. రైతు కన్నా రాయి మేలు, అయినా నాగలి మీదే రైతు తలరాత గిరి గీసుకుంటాడు. ఆలోచనలు కట్టిపెట్టి నులకమంచం మీద నుంచి లేచి చీకటి పడుతుండడంతో కోడిపిల్లలను గంపకింద వేశాడు.

చంద్రయ్య భార్య వంటకట్టెలు ఏరుకుని ఇల్లు చేరింది. 'వేళకాని వేళ వర్షం తడిసిపోతిని గదా!' నిట్టూర్చింది.

''నీయవ్వ... తడిసిపోయావులే... రాకరాక రోహిణీకార్తెలో వర్షం పడితే అట్లాంటావు'' రాజమ్మను కసురుకున్నాడు చంద్రయ్య. కొడుకు సాయన్న పట్నం వెళ్ళి పంచలు కొని తెచ్చుకున్నాడు. కోడలు లక్ష్మి బీడీ కంపెనీ నుండి అప్పుడే వచ్చింది.

కోడలు లక్ష్మితో చంద్రయ్య ఆనందంతో ''అమ్మీ... ఈయేల రొయ్యపులుసు చెయ్యి చాన్నాళ్ళయిందే తిని'' అన్నాడు.

''ఊ...'' అంటూ వంటగది వైపు నడిచింది లక్ష్మి.

★ ★ ★

ఈ ఏడు పంట బాగుంది అనుకుంటే అనుకోని అతిథిలా వచ్చి పడింది పేదోడి మీద గునపం దెబ్బలా తుపాను. ఏం పాపం చేశామో ఏమో?! ఈ ఏడు పురుగు మందులకు, ఎరువులకు ఐదువేలు దాటింది అప్పు. పత్తి, కందులు, మొక్కజొన్న మొత్తం నాశనమైంది. గోదావరి సీమలో అయితే ఊళ్ళకు ఊళ్ళు సెలయేళ్ళయిపోయాయి. వందలాది మనుషులు, వేలాది పశువులు ఊపిరి వదిలి శవాల గుట్టలుగా మారాయి. రెండు వారాలుగా పంటలు నీటిలో ఉండడం వల్ల విత్తిన గింజలు తిరిగి వచ్చే ఆశ జారిపోయింది.

ఉన్న ఒక్క బోరు వేసవిలో నీరు చాలక పోవచ్చని మరో బోరు వేయిస్తే నీరు కొరత ఉండదని తలంచి వేయిస్తే... రెండు పాయింట్లలో రాతి పొడి తప్ప నీటిధార రాకపోయే. అవి ఓ పదివేలు వడ్డీ అప్పు సరిజోడవుతుంది. అరక మీది ఎద్దు చస్తే ఎద్దు మార్చడానికి మరో పదివేలు ఖర్చు. అంతా కలిసి అప్పు పాతికవేలు. ఈ ఏడాది గొంతు మీద కూర్చుంది. ఈ సంవత్సరం పంటలు పండితే సగం అప్పు,



# కరెంట్ పురుగు

**ఉండపాటి నరసింహస్వామి**

వడ్డీ ముడుతుందనే చంద్రయ్య గంపెడు ఆశ నిరాశగా మిగిలింది.

ఎలా...?

అప్పు తీరే మార్గం ఏది?

భార్య రాజమ్మ భర్తను పలుమార్లు ఓదార్చింది. ''నీవే ఇట్లా అయిపోతే ఉన్న ఒక్క పోరగాడి గతేంగాను? దేవుడే కీడుజేస్తా వుంటే నరులం మనం ఏంజేస్తాం? పోతే పోని ఐదెకరాలు అమ్మి అప్పు తీరుద్దువు... వేసంగి పంట పండకపోదా మన బాధలు తీరకపోతాయా?'' బండెడు ధైర్యాన్ని చంద్రయ్య గుండెల్లో నూరిపోసింది రాజమ్మ.

ఓదార్పు అవసరాలు, అప్పులు తీర్చదని చంద్రయ్యకు తెలియదా? పొలం గట్టు మీద కూర్చుని తన తలరాతను మట్టి తన్నుకు పోతుంటే మూగగా రోదించాడు.

చంద్రయ్య మనసు తొలిచే విషయం మరోటి... పది సంవత్సరాల క్రిందట చంద్రయ్య ఊరిలో మోతుబరి రైతు. ఎందరికో సహాయం చేసి, సలహాలిస్తూ బ్రతుకు మీదా, పల్లెమీదా మట్టిమీదా మమకారాన్ని నూరిపోసిన చంద్రయ్య చేనుగట్టున గుట్టుగా ఏడ్వడమా? తనను తాను నిందించుకున్నాడు. కాని ఈ రోజు కూడులో కూడా తేడా వచ్చింది. పచ్చడి, పెరుగు, నేతిచుక్క లేకుండా భోజనం ముగించని చంద్రయ్య నూకలు కొని గంజి కాచుకునే పరిస్థితి దాపురించింది. రైతుకు అప్పు చీడపురుగులా తొలుస్తుంది. పెరిగిన పంటకు పురుగులు, ఎండిపోయే బోరుబావి, మండిపోయే ఆకాశం, పగుళ్ళయిన పంటభూమి రైతును రాయిగా మారుస్తుంది.

★ ★ ★

వేసంగి పంటలు ఏపుగా పెరిగాయి. మార్చి మాసం రానే వచ్చింది. గోధుమ, మొక్కజొన్న, వరిపంట ఎంతో ఇంపుగా ఉంది. వేరుసెనగ పంట చెప్పవీలులేకుండా ఆనందాన్ని కలుగజేస్తుంది. ఎలాగైనా వేరుసెనగ పంటతో అప్పుతీరే మార్గం ఏర్పడిందని చంద్రయ్య ఆనందానికి అవధుల్లేవు.

బోరులో నీరు బాగానే ఉంది. అందరి కళ్ళు చంద్రయ్య బోరు మీదే ఉన్నాయి.

కాలం యధావిధిగా కదిలిపోతుంది. కరెంటు కోత గూర్చి రేడియోలో ప్రతిరోజు కూత. గంటలు గంటలుగా కరెంటు కోత వేటు పంటల మీద పడింది.

ఓ రోజు చంద్రయ్య సాయన్న పంటకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్ళి మోటారు వేయగానే పొగవచ్చి ఆగిపోయింది. లోవోల్టేజి... మోటారు కాలిపోయిన గుర్తు! ''దేవుడు ఈమారైనా కనికరం చూపకపోయె దేవుడికి మడిసిమీద ఇంత కసి ఎందుకో'' కొడుకు సాయన్నతో అనేశాడు చంద్రయ్య.

తంటాలుపడి మోటారు రిపేరు చేయిస్తే వెయ్యి రూపాయలు అప్పుల్లో జమ అయింది.

వారం గడిచిందో లేదో మరోమారు మోటారు కాలిపోయిన ఘాతుకం... చంద్రయ్యకు అప్పు దొరకక రాజమ్మ పెళ్ళినాటి కాళ్ళ కడియాలు అమ్మి మోటారు రిపేరు చేయించాడు చంద్రయ్య.

కరెంటు ఏ అర్ధరాత్రికో అపరాత్రికో వచ్చి గంటల్లో ఆరిపోతుంది. పగలు రాత్రి పొలంలో పడిగాపు పడుతున్నా అర ఎకరం తడి ఆనకముందే కరెంటు పోతుంది. పంట నాశనం కావడానికి కాలం మరెంతో దూరం లేదని చంద్రయ్యకు చూచాయగా అర్థమయింది.

పంటను కాపాడమని కనిపించని భగవంతుని వేడుకున్నాడు. దేవుడు కనికరిస్తే పొలం ఇలా ఎందుకుంటుంది? తనలాంటి వారు పేదవారుగా భూమిమీద ఎందుకు బ్రతుకుతారు? తన చిన్నతనంలో బావులు ఉండేవి మోట, రాటు నడిచేవి. ఎంత ఎండాకాలమైనా తనకు నీరు ఎండిన గుర్తులేదు. కరెంటు మీద మనుషులు ఆధారపడి బావులు పూడ్చేసుకున్నారు.

పంట పండుటాకులై పోతుంది. రక్షించేవారు లేరు. పాతికవేల అప్పు వడ్డీ కట్టడమెలా? చంద్రయ్య ముందు ప్రశ్నార్థకం మిగిలింది. ఏడవడం తప్ప మరేమీ చేయలేని పరిస్థితి. తన తండ్రి తనకు పాతిక ఎకరాలు రూపాయి అప్పు లేకుండా మిగిల్చిపోయాడు. తను తన కొడుక్కి పాతికవేలు అప్పు, పది ఎకరాల పంటకు నోచుకోని పనికిమాలిన భూమి మిగిల్చాడు.

అప్పు తీర్చమని ఒకరొక్కరు ఇంటిదారి పడుతున్నారు. సాకు చెప్పేందుకు ఏమి మిగిలింది? పంట ఎండిన మొదళ్ళు తప్ప. గింజలు వచ్చి గంజి తాగే యోగం లేనందుకు చేను గట్టుమీద పిచ్చివాడిలా తిరుగుతున్నాడు చంద్రయ్య. గ్రామానికి గ్రామం అంతా ఎవరిని ఎవరు ఓదార్చలేని దీనావస్థ దాపురించింది.

చంద్రయ్య కళ్ళు మూసినా తెరిచినా పాతికవేల అప్పు గుర్తుకువచ్చింది. కొడుకు సాయన్నను ఈ దీనస్థితిలోకి నెట్టినందుకు తనను తాను నిందించుకున్నాడు. వ్యవసాయం మీద కొడుకు ఎదుగుతాడని కలలు కనడం ఎందుకూ కొరగాకుండా పోయింది. వేడి నిట్టూర్పు విడిచాడు.

★ ★ ★

''ఒరేయ్ సాయన్న నా బ్రతుకు దగ్గర పడుతోందిరా అప్పు ఎట్లా కడ్తవో ఏమో?'' తన దీనావస్థ కొడుకుతో వెళ్ళబుచ్చాడు చంద్రయ్య.

''అట్లా ఎందుకంటావే అయ్యా భూమి అమ్మేసి అప్పుతీర్చి పట్నంబోయి కూలి జేసుకుందాం... నేను గప్పుడే జెప్పలే... వ్యవసాయం కన్నా కూలిజేసుకొని ఉంటే బాధలు లేకుండా బ్రతికేటోల్లం భూమి... భూమి... అని ఇంత పనయిపోయె'' నిట్టూర్చాడు సాయన్న.

''మా చిన్నతనంలో పెండ ఎరువుతో పంటలు పండించేవాళ్ళం. కాలం మారిపోయి యూరియా డిఏపి పురుగు మందులు అలవాటయిపోయె... పురుగులు మందు మింగడం అలవాటు చేసుకున్నాయి. అడపాదడపా నకిలీ పురుగు మందుల వల్ల పురుగులు బ్రతికి రైతుకు చచ్చేంత పనవుతుంది. అన్నంత ధరపెట్టి ప్రత్తి గింజలు, వేరుసెనగ గింజలు, వరిగింజలు, మొక్కజొన్న గింజలు కొంటిమి కదా. ఈ పురుగు మందులు, విత్తనాలు ఒక ఎత్తయితే ఈ కరెంటు పురుగు పంట మొత్తం తినేసె కదరా! ఈ కరెంటు పురుగును చంపేందుకు రైతుకు మందెక్కడ దొరుకుతుంది రా సాయన్న... మనం సరిగానే బిల్లు కట్టాం కదరా? అయినా ఈ పురుగు చావదు వేసవికాలంలో మొదలుపుట్టి వర్షాకాలం మొదటివరకు జీవిస్తుంది. ఈ కరెంటు పురుగును చంపలేమురా'' బావురుమన్నాడు చంద్రయ్య.

''ఎట్టా జరగేది ఉంటే అట్టా జరుగుతుంది ఏడవకే'' దుఃఖం దిగమించుకోలేక బావురుమన్నాడు తండ్రితోపాటు సాయన్న.

★ ★ ★

చీకటి రాత్రి ఆకాశాన చుక్కలు తమ ప్రభావాన్ని చూపేందుకు తంటాలు పడుతున్నాయి. చిమ్మటలు అరుస్తున్నాయి మేం బ్రతికుంటాం ధ్వనులతో ప్రతిధ్వనులతో దద్దరిల్లుతాం అంటూ పోటీపడి అరుస్తున్నాయి.

చంద్రయ్య పక్కలో మసలుతున్నాడు కుప్పగా పెరిగిన అప్పు, నాశనమైన పంట... నిద్రరాని రాత్రి... లేచి కూర్చున్నాడు. సాయన్న గాఢనిద్రలో ఉన్నాడనటానికి గుర్రు సాక్షిగా వినపడుతోంది. లేచి నిల్చుని పాక బయటకు నడిచాడు. పొలం కలియదిరిగాడు. చిన్నతనం నుండి మట్టిముద్దలతో కుస్తీపట్టి చెమట రాల్చి సేద్యంచేసిన భూమి ఈ రోజు ఎదురుతిరిగిన భూమి ఒక్కటేనా? తనకు తానే ప్రశ్నార్థకమై పోయాడు. తల్లితో పొలం గట్లంబడి తిరిగినపుడు ఒడ్డు ఎక్కలేక పడిన గాయం ఇప్పుడు మచ్చలా మోకాలికి మిగిలింది. ఈ రోజు పాక పొలంలో దిష్టిబొమ్మలా ఉంది. కొన్నాళ్ళ క్రితమైతే నీడ నిచ్చే తల్లిలా ఉండేది. గమ్యంలేని గత్యంతరం లేని నడక పొలం చుట్టూ తిరిగాడు చంద్రయ్య. వేసారి పాక చేరుకున్నాడు. కొడుకు గాఢనిద్రలో మునిగి ఉన్నాడు. చంద్రయ్యను ఆలోచనలు మాత్రం విడిచిపెట్టడం లేదు.

అప్పు తీర్చే మార్గం లేదు. పంట పండే అవకాశం లేదు. రైతుల పాలిట శాపమైన ఈ కరెంటు పురుగును చంపే చట్టం ఎప్పుడొస్తుంది... కరెంటు కోత గతులు తప్పుతుంది. రైతు ఆకాశం వైపు చూసి నేలమీద విత్తనం నాటే కాలం దశాబ్దాల క్రితమే చచ్చిపోయింది.

కరెంటు మోటారును చూసి పంటవేసి కరెంటు కోతకు గురయిన పంటను గడ్డిగా కోసే దశ రైతుకు దాపురించింది. ఇంత జరిగినా రైతు కుటుంబం అని ఎలా అనిపించుకోవడం. నేను లేకపోయినా సాయన్న వ్యవసాయం అమ్మి పట్నానికి కూలికి పోతాడు. తను వ్యవసాయం అమ్మలేడు పల్లె విడిచి వెళ్ళనూ లేడు. తనకు చాతకాదు ఈ రాత్రి దీపం ఆరిపోవాలి. చీకట్లో పాకనంతా కలియదిరిగాడు చంద్రయ్య.

పాక మూలన కూర్చున్నాడు. మందుడబ్బా వెతికాడు. దొరకలేదు. అగ్గిపుల్ల వెలిగించి డబ్బా అందుకుని కొడుకు సాయన్న ముఖం తనివితీరా చూస్తుండగానే పుల్ల ఆరిపోయింది. ఆలస్యం చేయక మందు నోట కరుచుకున్నాడు. క్షణాలు దొర్లుతున్నాయి. చంద్రయ్య నేలమీద పడి విలవిలా తన్నుకొంటుండగా అలజడి వల్ల సాయన్నకు మెలకువ వచ్చి అగ్గిపుల్ల వెలిగించి చూశాడు.

మాటరానితనంతో గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. తలకోసిన కోడిలా తండ్రి తన్నుకొంటుంటే అయ్యా... అయ్యా... ఆకాశం దద్దరిల్లేలా అరిచాడు.

చుట్టుపక్కల పొలాల్లో పడుకున్న జనం సాయన్న అరుపులు విని వచ్చారు. ఆకాశం చీకటి చిమ్ముతూనే ఉంది.

అప్పటికే చంద్రయ్య ఊపిరి ఊడిపోయి శవమై మిగిలాడు.

సాయన్న ఏడుపు ఆగడం లేదు. కబురు తెలిసిన రాజమ్మ పరుగున వచ్చి భర్త శవంపై స్పృహ తప్పి పడిపోయింది. తల్లికి తండ్రి మరణవార్త ఎలా చెప్పాలి? అయ్యను కరెంటు పురుగు కాటేసింది. తల్లి వంక చూస్తూ శోష వచ్చేలా అరుస్తూనే ఉన్నాడు. ఊరి జనం చీకటిలోనే చంద్రయ్య పొలానికి చేరిపోయారు. కరెంటు పురుగును వెతికేందుకు కర్రలతో తయారయ్యారు రైతులు. కరెంటు పురుగు ఎక్కడ కనిపిస్తుంది. ఆకాశంలో నిర్వీర్యమైన తీగల్లోనా? ఎండిపోయిన జలాశయంలోనా? కాలిపోయిన కరెంటు మోటారులోనా? పంట ఎండిపోయి చంద్రయ్య మరణానికి కారణమైన పొలంలోనా ఎక్కడా? ఎక్కడా??

ఆకాశం చీకటివీడి వెలుగు వచ్చింది. చంద్రయ్య కుటుంబం కరెంటు పురుగు కాటుతో చీకటై చిక్కిపోయి బిక్కుబిక్కుమంటోంది.

చంద్రయ్య మృతదేహాన్ని పోస్టుమార్టంకు తీసుకెళుతుంటే... రైతులంతా అడ్డుకున్నారు. చంద్రయ్య శరీరంలో కరెంటు పురుగును వెతికే పరిస్థితి డాక్టర్‌కు కూడా తెలియదని ఈ పేద రైతులకేం ఎరుక. డాక్టర్ పని డాక్టర్ చేసుకుపోతాడు.

☆